# ఆంధ్రప్రదేశ్... పారిశ్రామిక ప్రగతి... విశ్లేషణ...

**ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణల తర్వాత కూడా పారిశ్రామిక రంగం ఆశించినంత అభివృద్ధిని సాధించలేకపోయింది. రాష్ట్రంలో విస్తారంగా లభ్యమయ్యే వనరులాధారంగా వ్యవసాయ, ఖనిజాధారిత పరిశ్రమలను నెలకొల్పాలని 'నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లయిడ్ ఎకనామిక్స్ రీసెర్చ్' నివేదిక సూచించింది. అయినప్పటికీ ఆ దిశగా ఎటువంటి ప్రయత్నం జరగలేదు. 1960లో కుటీర, చిన్నతరహా పరిశ్రమలు, పారిశ్రామిక సహకార సంఘాలు, చేతివృత్తుల వారికి పరపతి అందించడానికి 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్' (పరిశ్రమల శాఖ)ను ఏర్పాటు చేశారు. ఫార్మాస్యుటికల్స్, బయోటెక్నాలజీ, రసాయనాలు, తోలు , టెక్స్‌టైల్స్, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల వృద్ధి ద్వారా పారిశ్రామికాభి వృద్ధిని వేగవంతం చేయడానికి పరిశ్రమల శాఖ ప్రాధాన్యమిచ్చింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే ఉద్దేశంతో 1978లో ప్రతి జిల్లాలో జిల్లా పారిశ్రామిక కేంద్రాన్ని 'నోడల్ ఏజెన్సీ'గా ఏర్పాటు చేశారు.**

### పేపర్- III
### విభాగం-3 యూనిట్-1 సిలబస్

- ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల వృద్ధి, స్వరూపం, ఫ్యాక్టరీలు, చిన్న, అల్ప తరహా రంగాలు– తులనాత్మక పరిశీలన, వృద్ధి, బలహీనతలు, సమస్యలు.

రాష్ట్ర ప్రభుత్వం 1991 ఆగస్టులో ప్రకటించిన పారిశ్రామిక విధానం తర్వాత 2009 మార్చి వరకు పెద్ద తరహా పరిశ్రమలకు చెందిన 2883 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించాయి. వీటి ద్వారా 4,29,228 మందికి ఉపాధి లభించింది. ఇందులో అధిక శాతం పరిశ్రమలు 'సూక్ష్మ, చిన్న, మధ్యత రహా పరిశ్రమల చట్టం 2006'ప్రకారం చిన్న, మధ్యతరహా పరిశ్రమలుగా మార్పు చేసినవే. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన స్థానంలో కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన కార్యక్రమం' ప్రారంభించింది. ఈ పథకం ద్వారా 2008 మే వరకు 5,17,121



మంది చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారు. పారి శ్రామికాభి వృద్ధి కోసం 'పారిశ్రామిక పెట్టుబడి ప్రోత్సాహక పథకం 2005–10'ని ప్రకటించింది. ఇలా..పారిశ్రామిక రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొన్నప్పటికీ.. కొన్ని లోపాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. భారీ, మధ్య తరహా, చిన్నతరహా పరిశ్రమల వృద్ధి, వాటి బలహీనతలను చర్చించే నేపథ్యంలో ఈ సిలబస్ రూపొందించారు.

### ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్:

- **రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకొన్న చర్యలను వివరించండి?**

జ: రాష్ట్రంలో ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి నేపథ్యంలో.. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ఈ క్రమంలో అనేక ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ పారి శ్రామికాభివృద్ధి సంస్థ, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ మౌలిక పరిశ్రమల అభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసింది.

ప్రభుత్వ కృషి వల్ల సిమెంట్, పంచదార, కాగితపు, రసాయన ఎరువుల కర్మాగారాలు వృద్ధి బాటలో పయనించాయి. పారిశ్రామిక రంగంలో 15 శాతం వార్షిక వృద్ధితో పాటు ఉపాధి కల్పనే ధ్యేయంగా 'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల చట్టం 2006'ను తీసుకువచ్చింది. ఫలితంగా 2009 మార్చి వరకు 4703 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా 92,229 మందికి ఉపాధి లభించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పథకాల్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 'ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాన్ని' 2008 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. 2005 జనవరి నుంచి 2008 సెప్టెంబర్ వరకు మొత్తం రూ.12,017.68 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను రాష్ట్రం ఆకర్షించింది. అంతే కాకుండా రూ.100 కోట్ల పెట్టుబడికి పైగా ప్రారంభమయ్యే మెగా ప్రాజెక్టులకు, ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని ఔత్సాహిక పారి శ్రామికవేత్తలకు

ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీల ను ప్రకటించింది. ప్రతిపాదిత పారిశ్రామిక ఎస్టేట్‌లలో మౌలిక సౌకర్యాల అభివృద్ధి కోసం 'పారిశ్రామిక మౌలిక సౌకర్యాల అభివృద్ధి నిధి'ని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని మొత్తం 29 ప్రభుత్వ రంగ సంస్థల టర్నోవర్ రూ.25,320.83 కోట్లకు చేరుకుంది. ఎగుమతుల ప్రోత్సాహానికి 'వాణిజ్యం, ఎగుమతి ప్రోత్సా హక విభాగాన్ని' 1966లో ఏర్పాటు చేసింది.

☞ ఈ క్రమంలో పంచవర్ష ప్రణాళికల నేపథ్యంలో పారిశ్రామిక రంగంలో చోటు చేసుకున్న వృద్ధితో పాటు ప్రభుత్వం ప్రకటించిన అనేక ప్రోత్సాహక పథకాల ను వివరించాలి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి తీరు, తెన్నులను కూడా ప్రస్తావించాలి.

- **రాష్ట్రంలో పారిశ్రామిక విధానాల ఆవశ్యకతను పేర్కొంటూ 1991 పారిశ్రామిక విధానంలోని ముఖ్య అంశాలను వివరించండి?**

జ: రాష్ట్రప్రభుత్వాలకు వనరులు పెంచుకొనే సామర్థ్యం తక్కువ ఉండడంతో పటిష్ట పారిశ్రామిక విధానాలను రూపొదించుకోలేకపోతున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తూ.. పరిమితమైన మేరకు పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నాయి. 1956లో రూపొందించిన పారిశ్రామిక తీర్మానంలోని ముఖ్యాంశాలను 1991 వరకు కొనసాగించారు. ఈ తీర్మానం ద్వారా ప్రభుత్వ రంగానికి 17 పరిశ్రమల ను రిజర్వ్ చేశారు. ఆదాయ సంపదల్లోని వ్యత్యాసాలు తొలగించడానికి చిన్న, కుటీర పరిశ్రమలకు ప్రాధాన్యమిచ్చారు. గరిష్ట ఉత్పత్తి, ఉపాధి కల్పన, వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటు, ఎగుమతి ప్రాధాన్యత గల పరిశ్రమల వృద్ధి వంటి సాంఘిక, ఆర్థిక లక్ష్యాలను రాష్ట్ర పారిశ్రామిక విధానానికి అను బంధంగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 1977లో ప్రకటించిన పారిశ్రామిక విధానం చిన్నతరహా పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తే, 1980 పారిశ్రామిక విధానం ద్వారా ప్రభుత్వరంగ సామర్థ్యాన్ని పునరుద్ధరించడా నికి చర్యలు తీసుకున్నారు. లైసెన్స్‌ల విస్తృత ఏకీకరణ పథకాన్ని 1984లో ప్రవేశపెట్టారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు రాయితీలను ప్రకటించారు. ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం 1991లో నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ప్రభుత్వ రంగ పాత్ర తగ్గిస్తూ ప్రైవేటీక రణకు ప్రాధాన్యత, పరిశ్రమల లైసెన్సింగ్ విధానం రద్దు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఆంక్షలను తొలగించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ వంటివి ఇందులోని ముఖ్యాంశాలు. సంస్కరణల అనంతరం రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగాయి. పరిశ్రమల స్థాపన, పారిశ్రామికీకరణలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితమైంది. పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధిని రూ. 100 కోట్లతో ఏర్పాటు చేసింది. మెగా ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజి ప్రకటించింది.

☞ ఈ క్రమంలో 1956 తర్వాత ప్రకటించిన పారిశ్రామిక విధానాల్లోని ముఖ్యాంశాలను వివరిస్తూ.. ముఖ్యంగా 1991లో నూతన పారిశ్రామిక విధానంలోని అంశాలను విశ్లేషించాలి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పారిశ్రామిక సంస్కరణల అమలు ఏ విధంగా ఉందో వివరిస్తూ సమాధానం రాయాలి.

- **రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధిలో ఎదురవుతున్న సమస్యలు వివరించండి?**

జ: పారిశ్రామిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వ్యవస్థాపూర్వక, దీర్ఘకాలిక సమస్యలుగా భావించవచ్చు. పారిశ్రామిక రుగ్మత రాష్ట్రంలో ప్రధాన సమస్యగా మారింది. పారిశ్రామిక రుగ్మతను సంస్థల ఆస్తి – అప్పుల పట్టిక, లాభ, వ్యయ పట్టికల ద్వారా తెలుసుకోవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థలలో ఉత్పాదక శక్తి తక్కువగా ఉండడం, అధిక సిబ్బంది, నిర్వహణ లోపం వంటి సమస్యలు నెలకొన్నాయి. ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో నెలకొన్న పోటీ వాతావరణం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మార్కెటింగ్ సమస్యల్ని ఎదుర్కొంటున్నాయి. కార్మిక చట్టాలు కఠినతరంగా ఉండటంతో పాటు రాష్ట్రంలో నెలకొన్న పారిశ్రామిక సంబంధాలు, శ్రామిక అశాంతి ఈ రంగ అభివృద్ధికి అవరోధాలుగా భావించవచ్చు.

☞ ఈ క్రమంలో రాష్ట్రంలో మౌలిక సౌకర్యాల కొరతను ప్రాంతాల వారీగా వివరించాలి. పరిశ్రమల కేంద్రీకర ణ జరగడానికి మౌలిక సౌకర్యాలు కొన్నిప్రాంతాల్లో అధికంగా లభ్యం కావడమే కారణం. మరోవైపు వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఎక్కువ అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. పారిశ్రామిక రుగ్మత, ముడి పదార్థాల కొరత, పరపతి సరిగా లభ్యం కాకపోవడం, మార్కెటింగ్ వంటి సమస్యలను ప్రధానంగా చర్చించాలి.

- **ఆంధ్రప్రదేశ్‌లో చిన్న, కుటీర పరిశ్రమల ఆవశ్యకతను, ఎదుర్కొంటున్న సమస్యలను వివరించండి?**

జ: రాష్ట్రంలో మూలధన కొరత ఎక్కువ. కాబట్టి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఆర్జించడానికి చిన్న, కుటీర పరిశ్రమలు దోహదం చేస్తాయి. ఉపాధి అవకాశాలు పెరగడానికి, ఆదాయ అసమానతలను తగ్గించ డానికి, ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధికి చిన్న, కుటీర పరిశ్రమలు తోడ్పడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న వనరుల వినియోగం ద్వారా భారీ పారిశ్రామికీకరణ సాధ్యమయ్యే నేపథ్యంలో ఈ పరిశ్రమలు ఎంతోప్రాధాన్యత సంతరించుకొన్నాయి.

పెట్టుబడి కొరత వల్ల చిన్నతరహా పరిశ్రమలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోలేక పోతున్నాయి. పురాతన యంత్రాల వినియోగం, అధిక వడ్డీకి పరపతి పొందడం, భారీ పరిశ్రమలతో పెరిగిన పోటీ వల్ల ఇవి మార్కెటింగ్ సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ప్రాంతాల వారీగా పరిశ్రమల ఏర్పాటులోనూ

అసమానతలు నెలకొన్నాయి. తెలంగాణాలో వరంగల్, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలు ఇప్పటికీ పారిశ్రామికీక రణలో వెనుకబడి ఉన్నాయి. రాయలసీమలో కూడా పారిశ్రామికీ కరణ ఆశించిన స్థాయిలో జరగలేదు. దక్షిణ కోస్తా ప్రాంతంలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటైనప్పటికీ భారీ, మధ్యత రహా పరిశ్రమల ఏర్పాటులో ఈ ప్రాంతం వెనుకబడింది.

☞ ఈ క్రమంలో రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధికి ఈ పరి శ్రమలు ఎలా దోహదపడతాయనే అంశాన్ని ఆయా ప్రాంతాల్లో లభ్యమయ్యే వనరుల ఆధారంగా విశ్లేషిస్తూ, ఆయా పరిశ్రమలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను క్షుణ్నంగా వివరించాలి.

## ముఖ్యాంశాలు

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పథకాల్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 'ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాన్ని' 2008 సెప్టెంబర్‌లో ప్రారంభించారు.
- కేంద్ర ప్రభుత్వం 1991లో ప్రకటించిన నూతన పారిశ్రామిక విధానంలో ప్రభుత్వ రంగ పాత్రను తగ్గిస్తూ ప్రైవేటీకీకరణకు ప్రాధాన్యతనివ్వడం, పరిశ్రమల లైసెన్సింగ్ విధానం రద్దు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఆంక్షలను తొలగించడం, ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ వంటివి ప్రధానాంశాలు.
- రాష్ట్రంలో 2009 మార్చి వరకు 4703 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా 92,229 మందికి ఉపాధి లభించింది.
- రాష్ట్రం 2005 జనవరి నుంచి 2008 సెప్టెంబర్ వరకు మొత్తం రూ. 12,017.68 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించింది.